# మత్తు

'ఈ విషయం నీకు తెలుసా?' అన్నాడు దేవేందర్ ఫోన్ చేసి.

'ఏ విషయం?' అన్నాను.

'మన ప్రొఫెసర్ శంకర నారాయణగార్కి బ్రెయిన్‌లో ట్యూమర్ ఫార్మయిందట. వారం రోజుల క్రితం ఆపరేషన్ చేసి దాన్ని తీసేశారట. ప్రొఫెసర్‌గారి భార్య రాత్రి బెంగ్లూరు నుండి ఫోన్ చేసి నాకీ విషయం చెప్పింది' అన్నాడు దేవేందర్.

'అలాగా! ప్రొఫెసర్‌గారు ఇప్పుడెలా ఉన్నారో' అన్నాను.

'ఇప్పుడు బాగానే ఉన్నారట... ఇంకా హాస్పిటల్ నుండి డిశ్చార్జి కాలేదట... మనం ఒకసారి వెళ్ళి వారిని చూసొస్తే బావుంటుందేమో'

'ఎక్కడికి? బెంగ్లూరుకే'

'అవును-బెంగ్లూరుకే- ఆయనుండేది బెంగ్లూరులోనే కదా!'

'అవుననుకో... కానీ అంత దూరం వెళ్ళాలంటే కొంచెం ముందుగా ప్లాన్ చేసుకోవాలెగదా'

'బెంగ్లూరు యేమంత దూరమనీ? మన హనుమకొండ నుండి బెంగ్లూరుకు డైరెక్ట్ బస్సుంది. ఇక్కడ సాయంత్రం బస్సులో కూర్చున్నామంటే తెల్లారేటప్పటికల్లా బెంగ్లూరులో ఉంటాం- ప్రొఫెసర్‌గార్ని చూసి అక్కడ్నించి సాయంత్రం బయల్దేరి యిక్కడ కొచ్చేద్దాం. ఓ రెండ్రోజులు సి.ఎల్. పడేస్తే సరిపోతుంది.'

'నీ ప్లాన్ బాగానే ఉంది గానీ అంత దూరం బస్సులో వెళ్ళాలంటే కష్టమే'

'యేం కష్టం లేదు. ఇప్పుడిక్కడ్నించీ బెంగ్లూరుకు హైటెక్ బస్సు వేశారు. జర్నీ చాలా కంఫర్టబుల్‌గా ఉంటుంది. యూ నీడ్ నాట్ వర్రీ'

'సరే అయితే... ఎప్పుడు వెళ్దామంటావు?'

'రేపే వెళ్దాం. రేపు సాటర్‌డే కాబట్టి మనకు సన్‌డే కూడా కలిసొస్తుంది. నేనీ రోజు బస్సు స్టేషన్‌కు వెళ్ళి రేపటికి బెంగ్లూరు బస్సులో మనకు రెండు సీట్లు రిజర్వ్ చేయిస్తాను. రేపు సాయంత్రం మూడున్నరకు నువ్వు బస్సు స్టేషన్ కొచ్చెయ్'

'అలాగే' అంటూ నేను ఫోన్ పెట్టేశాను.

ప్రొఫెసర్ శంకరనారాయణ్ మేం కాలేజిలో బి.ఎ. చదువుతున్న రోజుల్లో మాకు ఇంగ్లీషు చెప్పేవాడు. ఆయన పాఠం చెప్పే పద్ధతి అద్భుతంగా, అనితర సాధ్యమనిపించేలా ఉండేది. ఆయన నోటివెంట ఇంగ్లీషు భాష ఒక మహా ప్రవాహంలా వెలువడేది. పదాల కోసం ఒక్క క్షణం కూడా తడుముకునేవాడు కాడు. ఎంత సంక్లిష్టమైన విషయాన్నైనా ఆయన అరటి పండు వొలిచి చేతిలో పెట్టినంత సులభంగా, సూటిగా, స్పష్టంగా చెప్పేవాడు- చాలా త్వరలోనే మేమిద్దరం ఆయనకు అత్యంత సన్నిహితులైన శిష్యులంగా మారిపోయాం. దాదాపు ఇరవై సంవత్సరాల క్రితం ఆయనతో ఏర్పడిన ఈ అనుబంధం ఇప్పటికీ అలాగే కొనసాగుతోంది. ప్రొఫెసర్ శంకర నారాయణ్ ఉస్మానియా యూనివర్సిటీ నుండి ప్రొఫెసర్‌గా రిటైర్ అయిపోయాక తన స్వంతూరు బెంగ్లూరుకు వెళ్ళి అక్కడే సెటిలైపోయారు. పదేళ్ళ క్రితం ఆయన రిటైరయినప్పుడు మేమిద్దరమూ బెంగ్లూరు వెళ్ళి ఆయన్ని కలిసొచ్చాం కూడా.

ఆ మర్నాడు సాయంత్రం మూడున్నరకు మేమిద్దరం బస్సు స్టేషన్‌లో కలుసుకున్నాము. హైటెక్ బస్సు పది నిమిషాలు ముందుగానే వచ్చింది. ప్రయాణీకుల్లో ఎక్కువమంది

ముందుగానే సీట్లు రిజర్వ్ చేయించుకున్నారు కాబట్టి అందరూ నెమ్మదిగానే ఒకరి తర్వాతొకరు బస్సులో ప్రవేశించారు.

'మన సీటు నెంబర్లు ఇరవై మూడు, ఇరవై నాల్గు' అన్నాడు దేవేందర్.

'అబ్బో! అయితే చాలా వెనకే' అంటూ మా సీట్లను వెతుక్కొని వాటి మీద కూర్చుండిపోయాం.

నాల్గైదు నిముషాల్లోనే బస్సు పూర్తిగా నిండిపోయింది. సరిగ్గా నాల్గింటికి బస్సు కదిలింది.

కండక్టర్ ఒక్కొక్కరి దగ్గరికొచ్చి టికెట్లు చెక్ చేస్తూ, రిజర్వేషన్ చేయించుకోని కొందరు ప్రయాణీకులకు టికెట్లు యిస్తూ మా దగ్గర కొచ్చాడు- దేవేందర్ పర్స్ తీసి టికెట్ల కోసం చూశాడు- పర్స్‌లో టికెట్లు లేవు.

'అరె! పర్స్‌లోనే పెట్టానే- కనిపించటం లేదేమిటి?' అన్నాడు దేవేందర్.

'తొందరపడకు... జాగ్రత్తగా చూడు' అన్నాన్నేను.

దేవేందర్ చాలా సేపు పర్స్‌తోపాటు తన జేబులన్నీ వెతికి చూశాడు-కానీ టికెట్స్ లేవు.

'పర్స్‌లో టికెట్స్ నువ్వే పెట్టావా?' అడిగాను.

'లేదు- మా మిసెస్ పెట్టింది. పెడ్తున్నానని చెప్పింది కూడా!' అన్నాడు దేవేందర్.

'అయితే ఇక వాటిమీద ఆశ వదులుకో' అన్నాను.

అప్పటికే బస్సు సిటీ అవుట్‌స్కర్ట్స్ దాటి హైదరాబాద్ హైవే మీద వేగంగా వెళ్తోంది.

ఇప్పుడేమవుతుంది? కండక్టర్ మమ్మల్నిద్దర్నీ బస్సులో నుంచి దింపేస్తాడా? టికెట్స్ గురించి ఇంత అశ్రద్ధగా ఉన్న దేవేందర్ మీద కోపమొచ్చింది. టికెట్స్ లేని కారణంగా బస్సులోంచి దింపేశారంటే తలకొట్టేసినట్టుగా ఉంటుంది.

దేవేందర్ సూట్‌కేసు కూడా తెరచి టికెట్ల కోసం వెతికి ఇక టికెట్లు దొరకవనీ, వాటిని ఇంట్లోనే మరచిపోయొచ్చానని తేల్చేశాడు.

'యేమయింది సార్! టికెట్లు దొరికినయా?' అంటూ కండక్టర్ బస్సంతా చెక్ చెయ్యడం పూర్తి చేసుకొని మా దగ్గరకొచ్చాడు.

'సారీ కండక్టర్! టికెట్స్‌ని నేను ఇంట్లోనే మరచిపోయి వచ్చాను' అన్నాడు దేవేందర్.

'అయితే దిగిపోండి సార్! అన్నీ తెలిసినోళ్ళు -మీరే గిట్లచేస్తే యెట్ల సార్!' అన్నాడు కండక్టర్.

బస్సులో కూర్చున్న ప్రయాణీకులందరూ మావైపే చూడసాగారు.

'మేం టికెట్స్‌ని ముందే రిజర్వ్ చేయించుకున్నాం కాబట్టి ఆ టికెట్ నెంబర్స్‌ని రిజర్వేషన్ కౌంటర్ వాళ్ళు మీకిచ్చే ఉంటారు. మీ దగ్గరున్న రిజర్వేషన్ చార్ట్ నొకసారి చూడండి!' అన్నాడు దేవేందర్.

'మాగజూసిన సార్! ఇగో ఈ రెండు సీట్ల టికెట్లు తప్ప మిగతావన్ని చెకయిపోయినయి. కాబట్టి ఈ రెండు టికట్లు మీయే కావొచ్చు. కాని మీ దగ్గర టికెట్లు లేనప్పుడు నేనేం జెయ్యాలె. టికట్లు మల్ల కొనుక్కోండ్రి' అన్నాడు కండక్టర్.

టికెట్లు మళ్ళీ కొనుక్కోవడమంటే ఆరు వందల రూపాయల్ని వట్టి పుణ్యానికి పోగొట్టుకోవడమన్నమాట!

'చూడండి కండక్టర్‌గారూ! మీ దగ్గర రిజర్వేషన్‌చార్ట్ ఉంది. దాంట్లో మా టికెట్ నెంబర్స్ ఉన్నాయి. దాన్ని బట్టి మేం టికెట్స్ తీసుకున్నట్టుగా రుజువయింది. టైమయిపోయిందన్న హడావుడిలో మా వాడు టికెట్స్‌ని పర్స్‌లో పెట్టుకోవడం మరచిపోయాడు. మేమిద్దరం యూనివర్సిటీలో రీడర్స్‌గా పనిచేస్తున్నాము. ఓ అర్జంట్ పని మీద బెంగ్లూరు వెళ్తున్నాం. ఇప్పుడు నువ్వు మమ్మల్ని మళ్లీ టిక్కెట్స్ తీసుకొమ్మంటే ఎలా చెప్పు? ప్లీజ్, అండర్‌స్టాండ్

అవర్ ప్రిడకమెంట్ అండ్ హెల్పజ్. నువ్వు చూడబోతే మా స్టూడెంట్‌లాగే ఉన్నావు. నువ్వు తప్పకుండా ఈ హెల్ప్ చేస్తావన్న నమ్మకం మాకుంది' అన్నాన్నేను అతన్ని సాధ్యమైనంత వరకు సంతోషపరచి, మా విషయంలో అతన్ని కాస్త ఉదారంగా ప్రవర్తించేలా చెయ్యాలన్న ఉద్దేశంతో.

'ఎవడన్నొస్తె ఎట్ల సార్!' అన్నాడతడు మా యిద్దర్నీ ఒక సారి పరీక్షగా చూసి.

'ఎవరన్నా వస్తే మేం అతన్ని కన్‌విన్స్ చేస్తాం. ఈ పొరపాటు మాదేనని ఒప్పుకుంటాం. నీమీదికేం రానియ్యం. పెనాల్టీ పే చెయ్యమంటే చేస్తాం' అన్నాను.

'మీ, ఇష్టం సార్!' అంటూ కండక్టర్ మా దగ్గర్నుంచి వెళ్ళిపోయాడు. దాంతో మేమిద్దరం గుండెల నిండా ఊపిరి తీసుకున్నాము.

చాలా దూరం వెళ్ళే బస్సు కాబట్టి బస్సులో బస్సును డ్రైవ్ చేస్తున్న డ్రైవర్‌తోపాటు ఇంకో డ్రైవర్ కూడా ఉన్నాడు. బస్సులో ప్రయాణం చేస్తున్న ప్రయాణీకులకు స్నాక్స్, కూల్‌డ్రింక్స్ లాంటివి సప్లై చెయ్యటానికి ఓ పదహారేళ్ళ కుర్రాడు కూడా బస్సులో ఉన్నాడు. అంటే వాళ్ళు మొత్తం నల్గురు... ఇద్దరు డ్రైవర్లు, ఒక కండక్టర్, ఒక స్నాక్స్ సప్లై చేసే బోయ్.

బస్సు వేగాన్ని పుంజుకొని హైదరాబాద్ వైపు దూసుకుపోతోంటే మేమిద్దం మాటల్లో పడ్డాం. మేం ఆర్ట్స్ కాలేజీలో బి.ఏ. చదువుతున్నప్పటి రోజుల్నీ, ఆ తర్వాత హైదరాబాద్‌లో ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఏ చదువుతున్నప్పటి రోజుల్నీ అప్పటి లెక్చరర్స్‌నీ, అందులో ముఖ్యంగా శంకర నారాయణగార్నీ గుర్తు చేసుకుంటూ ఎన్నో కబుర్లు చెప్పుకున్నాం.

బస్సు హైదరాబాద్ చేరేటప్పటికి యేడున్నరయిపోయి బాగా చీకటి పడిపోయింది. అది నవంబర్ నెల. చలికాలం. కోల్డ్‌వేవ్ కారణంగా మామూలు కంటె ఎక్కువ చలిగా ఉంది. బస్సు హైదరాబాద్ చేరుకోగానే బస్సులో వున్న ప్రయాణీకుల్లో చాలా మంది తమ సూటుకేసుల్ని తెరచి స్వెట్టర్లనూ, మఫ్లర్లను తలకు చుట్టుకున్నారు. దేవేందర్ కూడా స్వెట్టర్ తీసి తొడుక్కున్నాడు. నేను నా సూట్‌కేసులోంచి షాల్ తీసి కప్పుకున్నాను.

ఎనిమిదింటికి బస్సు హైదరాబాద్ బస్సు స్టేషన్ నుండి బయల్దేరింది. బస్సులో వెనక ఉన్న రెండు సీట్లు తప్ప మిగిలినవన్నీ నిండిపోయాయి.

హైదరాబాద్ రోడ్ల మీద దట్టమైన ట్రాఫిక్‌లోంచి దారి చేసుకుంటూ మా బస్సు బెంగ్లూరు హైవే మీద వెళ్ళిపోతోంది.

తొమ్మిదింటికి మేం జడ్‌చర్ల చేరాం.

జడ్‌చర్లలో బస్సు ఐదు నిమిషాలాగింది. ముగ్గురు ప్రయాణీకులు దిగిపోయారు. ముగ్గురు ప్రయాణీకులు బస్సెక్కారు. బస్సు బడ్‌చర్లను దాటి మూడు నాలుగు కిలోమీటర్లు వచ్చాక రోడ్డు పక్కనే నిల్చున్న ఇద్దరు ప్రయాణీకులు బస్సును ఆపమని అర్థిస్తూ చేతులూపడం బస్సు హెడ్‌లైట్ల వెలుగులో స్పష్టంగా కనిపించింది. ఆ ఇద్దరు ప్రయాణీకుల పక్కనే రెండు తెల్లటి పాలిథిన్‌తో ప్యాక్ చేసిన పెద్ద బండిల్స్ కూడా కనిపించాయి.

వాళ్ళను చూసిన డ్రైవర్ కండక్టర్‌తో 'ఆపమంటవా?' అన్నాడు.

'ఆపు - వెనక రెండు సీట్లు ఖాళీగున్నయి' అన్నాడు కండక్టర్.

వాళ్ళు బస్సు స్టాపులేని చోట బస్సాపుతున్నారంటే అందుకు కారణం లగ్గేజేనని ప్రయాణీకుల్లో చాలా మందికి అర్థమైపోయింది.

డ్రైవర్ ఆ ఇద్దరు ప్రయాణీకుల పక్కనే బస్సాపాడు. కండర్టర్ డోర్ తెరచి వాళ్లను 'ఎక్కడికిబోవాలె?' అని అడిగాడు.

'బెంగ్లూరుకు బోవాలె' అన్నాడు వాళ్ళిద్దరిలో బాగా నల్లగా ఉన్న వ్యక్తి.

'ఆ లగ్గేజి కూడా మీదేనా?' అన్నాడు కండక్టర్.
'మాదే' అన్నాడు నల్లటి వ్యక్తి.
'దాంట్లో యేమున్నయి?' అన్నాడు కండక్టర్.
'యేమీ లేవు... చీరలున్నయి. వాటిని బెంగ్లూర్ల వాపసియ్యాలె' అన్నాడా వ్యక్తి.
'టికెట్లు జడ్చర్ల నుంచి తీసుకోవాలె.... లగ్గేజికి యాభై రూపాయలయితది' అన్నాడు కండక్టర్.
'యేం ఫరవాలేదు... యిస్తం' అన్నారు వాళ్ళిద్దరూ.
'అయితే ఎక్కుండ్రి' అంటూ కండక్టర్ బస్సు డోర్ పూర్తిగా తెరిచాడు.

వాళ్లిద్దరూ బస్సెక్కారు- నల్లటి వ్యక్తే ఆ రెండు బండిళ్ళను బస్సులోపలకు తెచ్చి డ్రైవర్ క్యాబిన్ పక్కనున్న ఖాళీ స్థలంలో పెట్టేశాడు. వాళ్లిద్దరూ బస్సు వెనక్కొచ్చి ఖాళీగా ఉన్న ఆ రెండు సీట్లలో కూర్చున్నారు. బస్సు కదిలివేగాన్ని పుంజుకుంది.

ఆ ఇద్దరిలో మొదలు బస్సెక్కిన వ్యక్తి కాస్త మంచి బట్టలు వేసుకొని ఓ మధ్య తరగతికి చెందిన మర్యాదస్తునిలా కనిపించాడు. ఎర్రగా ఉన్నాడు. తెల్లటి ప్యాంటు, షర్ట్ వేసుకొని చేతిలో ఒక బ్యాగ్ పట్టుకొని అతడు బస్సులో ప్రవేశించాడు.

బండిల్స్ పట్టుకొని బస్సెక్కిన వ్యక్తి నల్లగా, పొడుగ్గా ఉన్నాడు. అతడు వేసుకున్న ప్యాంట్, షర్ట్ బాగా మాసిపోయి ఉన్నాయి. అవి యేరంగులో ఉన్నాయో కూడా తెల్చుకోవడం కష్టం. అతని తలమీది గుబురైన వెంట్రుకలు తైలసంస్కారం లేక చిందరవందరగా ఉన్నాయి. అతడు స్నానం చేసిగానీ, గడ్డం గీసుకొనిగానీ చాలా రోజులయినట్టుగా కనిపించాడు. అతడు బస్సులో ప్రవేశించగానే బస్సంతా సారాయి వాసన వ్యాపించింది. దాన్ని బట్టి అతడు బాగా తాగి ఉన్నాడని అర్థమైంది. అతడు వంకర టింకరగా నడుస్తూ వెనక సీట్లోకెళ్ళి కూర్చున్నాడు.

'సారా మీద బ్యాన్ ఉంది కదా! అయినా జనం తాగుతూనే ఉన్నారు. వీళ్ళకింత సారా ఎక్కడ్నించి సప్లై అవుతున్నదో?' బస్సులో కూర్చున్న ప్రయాణీకుడెవరో అడిగాడు.

'గుడుంబ సార్! గుడుంబ- ఎంత కావాల్నంటె అంత దొరుకుతది- సారా కంటె గుడుంబ చాలా చీప్‌గ దొరుకుతాంది- ఇరవైరూపాయలు పెడ్తే లీటర్ గుడుంబ దొరుకుతది. అదే ఇదివరకు ప్రభుత్వం సారా సప్లై చేసినప్పుడు లీటరు సారాకు అరవై రూపాయలుండె. ఇరవై రూపాయలకే లీటర్ గుడుంబ దొరుకుతాంటె తాగకుంట ఎవరుంటరు సార్! గీ గుడుంబ జెయ్యబట్టి కొందరు బంగ్లాలు కడ్తున్నరు.... హీరో హోండాల మీద తిరుగుతున్నరు.... గవర్నమెంట్ సారా మీద బ్యాన్ బెట్టంగనే యేమయింది సార్! ఇదివరకంటె ఎక్కువ తాగుతున్నరు... పల్లెటూర్లల్ల గుడుంబ యేర్లై పారతాంది' అన్నాడు కండక్టర్.

అలా అంటూనే కండక్టర్ వెనక సీట్ల మీద కూర్చున్న ఆ ఇద్దరు ప్రయాణీకుల దగ్గరకొచ్చి 'నాల్గు వందల రూపాయలియ్యుండ్రి' అన్నాడు.
'నాల్గు వందలెందుకట్రా?' అన్నాడు తాగివున్న వ్యక్తి,
'మీ టికెట్లకు... లగ్గేజికి కలిపి.... మొత్తం నాల్గువందలు... జల్దీ తియ్యుండ్రి' అరచినట్టుగా అన్నాడు కండక్టర్.
'టిక్కెట్లకేం తొందరొచ్చిందోయ్... బెంగ్లూరుకు బోయినంక తీసుకుంటంలే- మేమెక్కడికిపోతం' అన్నాడు తాగివున్న వ్యక్తి.
అందరూ గొల్లుమని నవ్వారు.
'బెంగ్లూరుకు బొయినంక తీసుకుంటవా? ఈ బస్సేమన్న నీ తాత జాగీరనుకున్నవా?' అన్నాడు కండక్టర్.

'కాకపోతే నీ తాత జాగీరనుకున్నవా?' అన్నాడా ప్రయాణీకుడు.

'యేయ్! ఎక్కువ తక్కువ మాట్లాడకు... పైసలు తీయ్...' అన్నాడు కండక్టర్.

'పైసలు బెంగ్లూరుకు పోయినంకనే ఇస్త. యేం జేసుకుంటవో జేసుకో' అన్నాడతడు.

'అరేయ్ వీరయ్య! జల్దీ పైసలు తీసియ్యి. లొల్లిబెట్టకు' అన్నాడు అతనితో బస్సెక్కిన అతని మిత్రుడు.

'నువ్వు నోర్మూసుకోర రాజయ్యా! గీ కండక్టర్ గాని సంగతేందో నేను జూస్త! మేం బస్సుల్నే ఉంటం గదా.... బెంగ్లూరొచ్చేదాక ఎక్కడికి బోతలేంగదా... టిక్కెట్లు బెంగ్లూరుకు బొయినంక తీసుకుంటమంటే వాడు నీ తాత జాగీరంటడా? నేనెవర్ననుకుంటున్నడు. హోల్ జడ్చర్ల మొత్తంల నా అంత బిజినెస్ జేసెటోడింకెవడన్న ఉన్నడా?' అన్నాడు ఆ వీరయ్యనబడే వ్యక్తి.

'నువ్వు ఎవ్వనివైతె నాకేందిరా! నఖరాలు జెయ్యకుంట మొదలు పైసలు తియ్యి' అన్నాడు కండక్టర్.

'నఖరాలెవడు జేస్తండ్రా. నువ్వు నఖరాలు జేస్తున్నవు... నా దగ్గర పైసలు లేవనుకుంటున్నవారా? నేను నీ కళ్ళకో ఛూతియాగాని లెక్క కనబడ్తున్నాన్రా. గా బండిళ్ళ ఉన్న ఒక్క పట్టుచీర పదివేలు ఖరీదు జేస్తది. నీ అసుంటోళ్ళు నా దగ్గర వందమంది పనిజేస్తున్నరు....' అన్నాడు వీరయ్య.

'అరేయ్ బద్మాష్! యేం మాట్లాడుతున్నవురా! పైసలు దీస్తవా? బస్సు దిగుతవా?' అన్నాడు కండక్టర్.

'నన్ను బస్సుల్నించి దించే మొనగాడింక పుట్టలేదురా... నేను బెంగ్లూరుకు బొయినంకనే టికెట్లు దీసుకుంట' అన్నాడు వీరయ్య.

ప్రయాణీకులందరూ సీట్ల మీది నుంచి లేచి ఈ దృశ్యాన్ని చూడసాగారు.

'అరెయ్ వీరయ్యా! నీకు దండం పెడ్తగని టికెట్లు తీసుకోరా! పైసలు నాకియ్యి. టికెట్లు నేను దీసుకుంట' బతిమాలుతున్నట్టుగా అడిగాడు రాజయ్యనబడే వ్యక్తి.

'పైసలు నేను వానికియ్య, నీకియ్య' అన్నాడు వీరయ్య.

'అయితె నేను బస్సు దిగిపోత' అన్నాడు రాజయ్య.

'పోరా పో... ఎవ్వన్ని బెదిరిస్తున్నవు... నువ్వు లేకపోతే నేను బెంగ్లూరు పోలేననుకుంటున్నవా? బెంగ్లూరు నాకేమన్న కొత్తనుకుంటున్నవా? మస్తుసార్లు బొయిన' అన్నాడు వీరయ్య.

'వీడు జర తాగున్నడు కండక్టర్ సాబ్. జర అడ్డందిడ్డం మాట్లాడుతాండు. మీరేమనుకోకుండ్రి. వాని దగ్గరున్న పైసలు నేను దీసిస్త. కొంచెం ఆగుండ్రి' అన్నాడు రాజయ్య.

రాజయ్య వీరయ్య బుషర్ట్ జేబులో చెయ్యిబెట్టి చూశాడు.

'నీ జేబుల పర్సుండె గదరా... దాంట్లె ఐదువందలుండె గదరా... యేం జేసినవు?' కంగారుగా అన్నాడు రాజయ్య.

'కండక్టర్‌గాడు కొట్టేసిండు గావచ్చు' అన్నాడు వీరయ్య. ఆ మాట విని ప్రయాణీకులందరూ గొల్లున నవ్వారు.

'అరేయ్ బద్మాష్! నోరుముయ్యి!' అన్నాడు కండక్టర్.

రాజయ్య వీరయ్య పాంటు జేబులన్నీ వెతికాడు. కానీ అతనికెక్కడా పర్స్‌గానీ, పైసలుగానీ కనిపించలేదు.

రాజయ్య లేచాడు.

'వీనితో లాభం లేదుసార్! పర్సెక్కడ్నో పోగొట్టిండు. నన్ను బెంగ్లూరుకు బోదామని బలవంతంగ ఇంట్ల నుంచి తీసుకొచ్చిండు. నీ ఖర్చంత నేనే పెట్టుకుంటనన్నడు. వీడు బెంగ్లూరు

నుంచి చీరలు తెచ్చి జెడ్చర్లల అమ్ముతడు... అమ్ముడుపోని చీరెల్ని మల్ల బెంగ్లూరుకు తీసుకుపోయి వాపసిస్తడు. ఇప్పుడు వీడు బెంగ్లూరుకు గందుకేపోతున్నడు. చీకట్ల ఒక్కన్నే పోతున్న.... నువ్వు తోడు రావాల్నని నా వెంటబడి నన్ను గీ చలిల తీసుకొచ్చిండు. దార్లె గుడుంబ తాగిండు. కొంచెం తాగినంక ఇగ చాలు ఊరుకోరా అంటె వినకుంట లీటరు గుడుంబ పట్టిచ్చిండు. వీని దగ్గరున్న పర్స్ గుడుంబ తాగిన కాన్నే పోయినట్టుంది. -బస్సు ఆపుండ్రి- నేను దిగిపోత' అన్నాడు రాజయ్య.

'నువ్వొక్కనివే దిగిపోవుడేంది- వాన్ని కూడ తీసుకపో' అన్నాడు కండక్టర్.

'వానితోటి నేనెక్కడ పెట్టుకుంట సార్, వాడు బాగ తాగున్నడు. వానికి సోయే లేదు. వాడూ, మీరూ ఎక్కన్న బోండ్రి- నేనైతే దిగిపోతున్న డ్రైవర్ సాబ్! జర బస్సు ఆపుండ్రి' అన్నాడు రాజయ్య. డ్రైవర్ బస్సాపాడు. రాజయ్య వెంటనే డోర్ తెరచుకొని బస్సు దిగి రైట్ అని అరిచాడు- డ్రైవర్ బస్సును పోనిచ్చాడు.

'అరేయ్ తాగుబోతోడా! నీ సంగతి జెప్పు? పైసలిస్తవా? వానోలె దిగిపోతవా?' అన్నాడు కండక్టర్ వీరయ్య దగ్గరకొచ్చి.

'పైసలు బెంగ్లూరు బొయినంక తీస్కో! కావాల్నంటె ఇప్పుడు టికెట్ కొట్టు!' అన్నాడు వీరయ్య.

వీరయ్య మత్తులో కెళ్లిపోతున్నాడని అందరికీ అర్థమైంది. అతడు పక్కసీటు మీదికొరిగిపోయి మాట్లాడుతున్నాడు.

'మర్యాదగా పైసలు తీస్తవా? తియ్యవా?' అరచినట్టుగా అన్నాడు కండక్టర్.

'పైసలు గీ జేబులున్నయి. నువ్వే తీస్కో' అన్నాడు వీరయ్య.

కండక్టర్ వెళ్ళి అతని జేబులన్నీ చూశాడు. అతని దగ్గర పైసలున్న జాడెక్కడా కనిపించలేదు.

'గీ బాడుఖావ్‌గాని తోటి నువ్వు గింత టైమ్ వేస్ట్ జేస్తున్నవేంది. చప్పుడు జేక వాన్ని బస్సుల్నించి కిందకు దింపుదాం పట్టు' అన్నాడు బస్సులో ఉన్న అడిషనల్ డ్రైవర్ అక్కడి కొచ్చి.

'నన్ను బస్సుల్నించి దించేటోడెవడ్రా.... ఎవడ్రా వాడు... వాడు ప్రాణాలతోటి బతుకతడా?' మత్తులో జోగుతూనే అంటున్నాడు వీరయ్య.

'యేయ్ రెడ్డి! జర బస్సాపు. వీన్ని కింద పడెయ్యంది లాభం లేదు' అన్నాడు అడిషనల్ డ్రైవర్. బస్సాగింది.

ఇద్దరు డ్రైవర్లు, కండక్టర్, స్నాక్స్ బోయ్... మొత్తం నల్గురూ వీరయ్య దగ్గరకొచ్చారు.

'అరేయ్.... లేరా... లేలే...' అన్నాడు రెడ్డి అనబడే డ్రైవర్. అంటూనే వాళ్ళు వీరయ్యను పట్టుకొని సీటు మీది నుండి కిందపడేసి గొడ్డును బాదినట్టు బాదతూ, బస్సు డోర్ దగ్గరకు ఈడ్చుకొచ్చారు. అతడు వాళ్ళ నుండి తప్పించుకోడానికి తన శక్తి కొద్దీ పోరాడాడు. కానీ నల్గురు మనుషులతో అతడు ఒక్కడూ పోరాడలేకపోయాడు. వాళ్లతన్ని బస్సులో నుంచి ఓ వస్తువును విసిరేసినట్టుగా బయటకు విసిరేశారు. అతడు బస్సు బయట దభీమని పడిపోయిన చప్పుడు వినిపించింది. ఆ తర్వాత వాళ్ళు అతని రెండు బండిళ్ళను కూడా బయటకు విసిరేశారు.

డ్రైవర్ వెళ్ళి స్టీరింగ్ దగ్గర కూర్చొని బస్సును పోనిచ్చాడు. అంతా క్షణంలో జరిగిపోయింది. ప్రయాణీకులందరూ పీడా వదిలిపోయిందని సంతోషించారు.

రక్తం గడ్డకట్టించే ఈ చలిలో, ఈ కటిక చీకట్లో రోడ్డు మీదికి విసిరేయబడ్డ ఆ మనిషి యేమయిపోయాడోనని నేను ఆలోచించసాగాను. తెల్లారేటప్పటికి అతని శరీరం చలికి గడ్డకట్టుకుపోయి అతడు చనిపోవడం ఖాయమనిపించింది.

అతనికి పెళ్లయ్యే ఉంటుంది. అతని మీద ఆధారపడి బతికే భార్యా, పిల్లలూ ఉండే ఉంటారు. వాళ్ళతో బెంగ్లూరుకు వెళ్లొస్తానని చెప్పే ఇంట్లోంచి బయల్దేరి ఉంటాడు. ఒక్కన్నీ వెళ్ళలేనని ఓ మిత్రున్ని తోడు తెచ్చుకుంటే ఆ మిత్రుడు మధ్యలోనే వెళ్లిపోయాడు. గుడుంబా తాగకపోతే అతనికీ గతి పట్టేదా? గుడుంబా తాగిన దగ్గరే పర్స్ పోగొట్టుకుని ఉంటాడు. మేం కూడా టికెట్లు తెచ్చుకోవడం మరచిపోయాం. కొంచెమైతే మాక్కూడా అతనికి పట్టిన గతే పట్టేదేమో. కానీ మేం మర్యాదస్తులమని కండక్టర్ గుర్తించాడు కాబట్టి మేం త్వరగానే టికెట్లు లేని పరిస్థితి వల్ల ఎదురయ్యే ఇబ్బందిలోంచి బయటపడగల్గాం.

ఇలా ఆలోచిస్తూ మేం నిద్రలోకి జారుకున్నాము.

తెల్లారేటప్పటికి బెంగ్లూరు వచ్చేసింది. బెంగ్లూరు బస్సుస్టేషన్లో బస్సు ఆగగానే ఒకరి తర్వాతొకరు ప్రయాణీకులందరూ బస్సు దిగి ఎవరి దారిన వాళ్ళు వెళ్ళిపోయారు.

చిట్టచివరకు మేమిద్దరమే దిగాం.

నేను బస్సు దిగుతూ రాత్రి జరిగిన సంఘటన గుర్తొచ్చి వెనక సీటు వైపు చూశాను. రాత్రి వీరయ్య కూర్చున్న సీటు కింద నల్లగా యేదో వస్తువు కనిపించింది. దాన్ని వెంటనే నేను పర్స్‌గా గుర్తించాను.

'కండక్టర్! ఆ లాస్టు సీటు కింద యేదో పర్స్‌లాంటిది పడుంది చూడు' అన్నాను బస్సు పక్కన నిల్చున్న కండక్టర్‌ను ఉద్దేశించి.

కండక్టర్ వెంటనే బస్సు లోపలకొచ్చి సీటు కిందున్న ఆ పర్స్‌ను తీసి ఓపెన్ చేసి చూశాడు. పర్స్‌లో ఐదు వంద రూపాయల నోట్లున్నాయి.

నేనూ, దేవేందర్ ఒకరి మొఖాలొకరం చూసుకున్నాము.

'నేను దీన్ని డిపోలో అప్పజెప్పుత సార్!' అంటూ కండక్టర్ ఆ పర్స్ జేబులో వేసుకొని బెంగ్లూరు బస్‌స్టేషన్లోకి వెళ్ళిపోయాడు. అతని వెంటే ఇద్దరు డ్రైవర్లు కూడా వెళ్ళారు.

'వాళ్ళు నిజంగా ఆ పర్స్‌ను డిపోలో అప్పజెప్పుతారంటావా? అన్నాడు దేవేందర్.

'యేమో! చెప్పలేం' అన్నాన్నేను.

ఆ మర్నాడు ఉదయానికల్లా మేం వరంగల్‌కు తిరిగొస్తూ హైదరాబాద్ చేరాం. హైదరాబాద్ బస్సుస్టేషన్లో దేవేందర్ ఆ రోజు పేపర్ కొన్నాడు. కాస్సేపతడు పేపర్ తిరగేసి 'ఇదిగో.... ఈ వార్త చూడు' అంటూ పేపర్ నా చేతికిచ్చాడు.

'గుర్తు తెలియని శవం' అన్న హెడ్డింగ్‌తో ఉన్న ఆ వార్తలో 'జడ్‌చర్లకు పది కిలోమీటర్ల దూరంలో బెంగ్లూరు నేషనల్ హైవే పక్కన గుర్తు తెలియని పురుషుని శవం పడి ఉంది. అతిగా తాగడం వల్లనే అతడు చనిపోయి ఉంటాడని పోలీసులు తెలియజేశారు' అని ఉంది.

దేవేందర్ నేనూ ఒకరి ముఖాలొకరం చూసుకొని నిట్టూర్చాం.

*(ఆంధ్రప్రభ దినపత్రిక, ఆదివారం, 14 మే 2000)*